క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



సభలో ప్రసంగిస్తున్న రమేష్

ఒంగోలు టౌన్: జిల్లా కేంద్రమైన ఒంగోలులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) మాజీ నాయకుడు జి.రమేష్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఒంగోలు నగర 45వ మహాసభలు జరిగాయి. ఒంగోలులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో నిరుపేద విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు కాలేజీల్లో చేరి అప్పులు చేసి చదువుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్, నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో పంచాయతీ కార్యదర్శి మృతి


శ్రీదేవి (ఫైల్)

నాగులుప్పలపాడు: కొంతకాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న మండలం పరిధిలోని చదలవాడ గ్రామ పంచాయతీ కార్యదర్శి బలభద్రుని శ్రీదేవి (44) శనివారం మృతి చెందారు. ఏడేళ్లుగా మండల పరిధిలోని మాచవరం, కండ్లగుంట పంచాయతీలలో కార్యదర్శిగా ఆమె విధులు నిర్వహించారు. 10 రోజుల నుంచి వ్యాధి తీవ్రత అధికం కావడంతో ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతదేహానికి ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఎంపీడీవో జయమణి, సిబ్బంది నివాళులర్పించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

ఒంగోలు సెంట్రల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి బీజేపీ బలోపేతానికి ప్రతి పదాధికారి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగేంద్రయాదవ్ కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం ఓబీసీ మోర్చా పదాధికారుల సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, నాగేంద్రయాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తానికొండ సురేష్‌యాదవ్ అధ్యక్షత వహించగా, పలు అంశాలపై చర్చించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

ఒంగోలు టౌన్: సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక లాయరుపేట సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. సిబ్బంది, వలంటీర్ల హాజరును పరిశీలించి విధులకు హాజరుకాని సిబ్బందికి గైర్హాజరు నమోదు చేశారు. స్పందన రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్లను తనిఖీ చేసి డ్యూటీలో భాగంగా బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. విధులకు యూనిఫాంతో హాజరుకావాలని సూచించారు. లాయరుపేటలో పన్నుల వసూలు కార్యక్రమంలో స్వయంగా పాల్గొని నల్లమోతు గోపి నుంచి రూ.లక్ష బకాయిని చెక్కు రూపంలో అందుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శాండిల్య, ఆర్వో మధుసూదనరావు, ఆర్ఐ మిరియాల శ్రీనివాసరావు, ఏడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగర సుందరీకరణలో భాగంగా కమిషనర్ వెంకటేశ్వరరావు పాత మార్కెట్ వద్ద కాలువలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఏఈ సౌజన్య పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కొత్తపట్నం: కొత్తపట్నం గ్రామంలో శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్లు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యులు పాల్గొని అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు, అన్ని రకాల రక్త పరీక్షలు, గుండె పరీక్షలు, ఈసీజీ మొదలగు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రోగులు వచ్చేటప్పుడు పాత రిపోర్టులు తీసుకుని రావాలని కోరారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ


అయ్యప్పస్వామి పటానికి నమస్కరిస్తున్న వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

దర్శి: స్థానిక పొదిలి రోడ్డులోని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నివాసంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పూజామందిరంలో అయ్యప్పస్వామి చిత్రపటాలు వుంచి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి కుటుంబం, భారీగా భక్తులు పాల్గొన్నారు.

మిచాంగ్ తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

- పశువైద్యాధికారి డాక్టర్ బేబీరాణి


కె.పల్లెపాలెంలో పశుపోషకులకు తుఫాన్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బేబీరాణి

కొత్తపట్నం: మిచాంగ్ తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కె.బేబీరాణి ప్రజలకు సూచించారు. కొత్తపట్నం కె.పల్లెపాలెం గ్రామంలోని తుఫాన్ షల్టర్‌లో శనివారం పశుపోషకులకు ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ముందుగా పశువులను లోతట్టు ప్రాంతాల నుంచి ఎత్తైన ప్రాంతాలకు తరలించాలన్నారు. పశువులకు కావాల్సిన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. హాస్పిటల్‌కు వచ్చి అవసరమైన మందులు తీసుకోవచ్చన్నారు. పశువులకు నష్టం వాటిల్లితే వెంటనే రెవెన్యూ, పశుసంవర్ధక సిబ్బందికి తెలియజేయాలన్నారు. తుఫాన్ తీవ్రతను బట్టి పశువులను వదిలి పెట్టాలన్నారు. తుఫాన్‌కు ముందు, తుఫాన్ సమయంలో, తుఫాన్ తర్వాత తీసుకోవాల్సిన నివారణ చర్యల గురించి వివరించారు. పశు ఆరోగ్య కార్డులను రైతులకు పంపిణీ చేశారు. గేదెలకు హెచ్ఎస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌కే కాలేషా, కొత్తపట్నం పశువైద్యాధికారి డాక్టర్ ఆషా, రైతులు పాల్గొన్నారు.

సెలవులు రద్దు చేసుకుని విధులకు హాజరుకావాలి...

ఒంగోలు రూరల్: మిచాంగ్ తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత, తహసీల్దార్ పసుపులేటి మురళి ఒంగోలు మండల మత్స్యకార గ్రామాల కార్యదర్శులను ఆదేశించారు. తీరప్రాంత గ్రామాల్లోని సచివాలయాల కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందికి శనివారం పలు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే సెలవుల్లో ఉన్న వారు సెలవులను రద్దు చేసుకుని విధులకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పూర్తిస్థాయిలో నింపుకోవాలని, సిలిండర్లు, చార్జింగ్ లైట్లు సచివాలయంలో సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. బలహీనంగా ఉన్న చెరువుకట్ట పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. వాతావరణ సమాచారం కార్యాలయాలకు అందించాలని కోరారు. మత్స్యకారులెవరూ సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని, బోట్లను మెరక ప్రాంతానికి తరలించాలని, వలలను వెంటనే గృహాల్లో భద్రపరచుకోవాలని తహసీల్దార్, ఎంపీడీవో తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర ఏర్పాట్ల పరిశీలన...

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో పి.అజిత కరవది జూనియర్ కాలేజీ, జెడ్పీ హైస్కూలును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆటస్థలాన్ని పరిశీలించి పాఠశాల పీడీ ప్రసాద్‌తో మాట్లాడారు. పాఠశాలను పరిశీలించడానికి వచ్చిన మద్దిపాడు జూనియర్ కళాశాల పీడీ.. పాఠశాల క్రీడా పోటీ అంశాలను వివరించారు. 15 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు వారి క్రీడాంశాల్లో రిజిస్ట్రేషన్ పొందాలని ఎంపీడీవో సూచించారు.

సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షం


మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు, అధికారులు

రంగాయపాలెం (కొత్తపట్నం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని బీజేపీ ఒంగోలు నియోజకవర్గ కన్వీనర్ యోగయ్య అన్నారు. రంగాయపాలెంలో శనివారం నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభకు సర్పంచ్ గాలి స్వరూప అధ్యక్షత వహించగా, యోగయ్య పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 17 రకాల పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. నిజజీవితంలో ఎదుర్కొనే సమస్యలను గుర్తించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పథకాలు పెట్టడం జరిగిందన్నారు. మోదీ పథకాలు చూసి ప్రపంచ దేశాలు భారత్ పైపు చూస్తున్నాయని కొనియాడారు. హౌసింగ్ ఈఈ పెరుగు శ్రీనివాస్‌ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గృహాలకు రూ.1.80 లక్షలు ఇస్తున్నాయని, డ్వాక్రా గ్రూపుల నుంచి రూ.35 వేలు ఇస్తున్నారని తెలిపారు. జగనన్న లేఅవుట్లలో 100 గృహాలు కట్టిస్తున్నామన్నారు. అగ్రికల్చర్ ఏడీ ప్రభాకర్ మాట్లాడుతూ ఎక్కువ ఎరువులు వినియోగించుకోకుండా తక్కువ ఎరువులతో పంటలు సాగు చేయాలన్నారు. మట్టి నమూనాల ఆధారంగా ఎరువులు వాడుకోవాలన్నారు. అనంతరం ప్రధాని ప్రచారాన్ని వీక్షించారు. ప్రధాన మంత్రి ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనక్షన్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాల చెన్నయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు గాలి మునలారెడ్డి, హౌసింగ్ ఏఈ నాంచార్లరెడ్డి, డాక్టర్ వైష్ణవి, ఆయుర్వేద డాక్టర్ రామారావు, బీజేపీ మండల అధ్యక్షుడు నాదారు సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి హుసాన్నారా, సునీత, ఎంపీటీసీ సభ్యుడు రామలింగం వెంకట్రావు, ఉపసర్పంచ్ పురిణి గోపి, రూట్ ఇన్‌చార్జి జయశంకర్ పాల్గొన్నారు.

జీజీహెచ్ అభివృద్ధికి శిద్దా సాయం



శిద్దా చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న జీజీహెచ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ

ఒంగోలు టౌన్: స్థానిక జీజీహెచ్ అభివృద్ధికి శిద్దా కుటుంబ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌బాబు శనివారం ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ సెంట్రల్ జోన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జీజీహెచ్‌లో మౌలిక సదుపాయాల కల్పన కోసం వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు చెక్కు అందజేశారు. నిత్యం జీజీహెచ్‌కి వైద్యం కోసం వేలాది మంది వస్తుంటారని, వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సాయం అందజేయడంపై జీజీహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ తిరుమలరావు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన హైదరీ క్లబ్ సభ్యులు


కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న హైదరీ క్లబ్ సభ్యులు

ఒంగోలు అర్బన్: ఇటీవల కొత్తగా ఎన్నికైన హైదరీ క్లబ్ పాలకమండలి సభ్యులు శనివారం ప్రకాశం భవనంలో కలెక్టర్, క్లబ్ ఎక్స్ అఫిషియో చైర్మన్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్‌లో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. క్లబ్ అభివృద్ధికి కృషి చేయాలని, క్లబ్ సభ్యులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.చంద్రమోహన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఈదుపల్లి గురునాథరావు, ట్రెజరర్ జీవీ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఈతముక్కలలో జగనన్న లే అవుట్ పరిశీలన


లే అవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ ఈఈ శ్రీనివాస్‌ప్రసాద్, రవీంద్రరెడ్డి

ఈతముక్కల (కొత్తపట్నం): ఈతముక్కలలో జగనన్న లే అవుట్‌ను హౌసింగ్ ఈఈ పెరుగు శ్రీనివాస్‌ప్రసాద్ శనివారం పరిశీలించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణానికి ముందే రోడ్లు, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు, ఉచిత విద్యుత్ మీటరు వంటివి కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల స్కీమ్‌కు రూ.1.80 లక్షలతో పాటు మీ సొంత నగదు కూడా ఉంటే గృహం పూర్తి చేసుకోవచ్చని సూచించారు. స్టేజీల వారీగా కట్టుకున్న వారికి బిల్లులు వెంటనే అకౌంట్‌లో జమ చేయటం జరుగుతుందన్నారు. జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ఈతముక్కల జగనన్న లే అవుట్లో 144 మందికి పట్టాలిచ్చామని, ఇప్పటికే బేస్‌మట్టాలు సగం అయ్యాయని, కొన్నిగృహాలు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు కూడా జరిగాయని వివరించారు. స్టేజీల వారీగా బిల్లులు కూడా వారి అకౌంట్లలో పడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అన్నం నాంచార్లరెడ్డి, ఆషా, పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి కిరణ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో నగదు రహిత లావాదేవీలు

- జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి

ఒంగోలు సిటీ: జిల్లాలోని అన్ని పంచాయతీలలో ప్రజలు నగదు రహిత లావాదేవీలు మరింత ఎక్కువగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి కోరారు. రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన సూచనల మేరకు ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలో విస్తరణాధికారులు, గ్రామకార్యదర్శులు మూడు వేల కంటే తక్కువ ఉన్న గ్రామ పంచాయతీలలో యూపీఐ చెల్లింపులు జరిపించాలని, మూడు వేల కంటే ఎక్కువగా ఉన్న గ్రామ పంచాయతీలలో పీఓఎస్ మెషీన్ ద్వారా చెల్లింపులు జరిపించాలని ఆదేశించారు. ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చెయ్యాలని, యూపీఐ, పీఓఎస్ మోషన్ ద్వారా చెల్లింపులు చేసే విధంగా ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో 26 జిల్లాల జెడ్పీ సీఈఓలు, డీపీఓ, డీఎల్‌పీఓలు పాల్గొన్నారు.

విధుల బహిష్కరణను వ్యతిరేకిస్తున్నాం

ఒంగోలు టౌన్: ఈ నెల 4వ తేదీ నుంచి మూడు రోజులపాటు విధులను బహిష్కరిస్తూ ఒంగోలు బార్ అసోసియేషన్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కె.స్వామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ టైట్లింగ్ యాక్టుపై జనరల్ బాడీ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వాలు చట్టం చేసినప్పుడు ఏదైనా లోపాలుంటే తగిన పద్ధతిలో సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని స్పష్టం చేశారు. మూడు రోజులపాటు న్యాయవాదులు విధులకు దూరంగా ఉంటే కోర్టు కేసులు, కక్షిదారులకు ఇబ్బంది ఉంటుందని పేర్కొన్నారు. ఏపీ టైట్లింగ్ యాక్ట్‌పై న్యాయవాదులు చేయనున్న నిరసన చట్టవ్యతిరేకమైన చర్యగా భావించిన వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు విధులకు హాజరుకానున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్‌కు చెందిన న్యాయవాదులంతా తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని కోరారు.

మహిళలను చిన్నచూపు చూడటం తగదు


ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మహిళల మానవహారం

ఒంగోలు రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని చిన్నచూపు చూడటం తగదని ఎంపీడీవో అజిత అన్నారు. డీఆర్‌డీఏ ఒంగోలు ఏపీఎం గోపీనాథ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన జండర్ మాసోత్సవాల్లో ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. మహిళలు, పురుషులు అని తారతమ్యం లేకుండా అందరికీ సమాన అవకాశాలు అన్ని రంగాల్లో ఉండాలన్నారు. ఉన్నత చదువులోనూ, ఆస్తి పంపకాల్లోనూ, ఉద్యోగ అవకాశాల్లోనూ సమానంగా ఉండాలన్నారు. నేటి కాలంలో పురుషులకు ఏ మాత్రం తీసిపోకుండా అన్ని రంగాల్లో మహిళలు అధిక వేతనం పొందుతున్నారన్నారు. బాలికలకు 18 సంవత్సరాల్లోపు వివాహం చేయకూడదన్నారు. మహిళలతో మానవహారం ఏర్పాటు చేసి మహిళా ఐక్యత గురించి తెలియజేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, ఏపీవో బ్రహ్మయ్య, డీఎంజీ వెంకటసుబ్బయ్య, సీసీలు చెంచులక్ష్మి, రమణయ్య, సుధాకర్, సామ్రాజ్యం, మండలంలోని అన్ని గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన


ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

ఒంగోలు: భద్రత, ప్రథమ చికిత్స అనే అంశంపై స్థానిక సాయిబాబా సెంట్రల్ స్కూలు విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని యాజమాన్యం నిర్వహించింది. విద్యార్థులు మూడు బృందాలుగా ఏర్పడి లఘునాటికల ద్వారా సందేశాన్ని అందించారు. అనంతరం విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ శృతి సాయినాథుని అభినందించారు. విద్యార్థి మంచి పౌరునిగా ఎదిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. కరస్పాండెంట్ జీవీ భాస్కర్, ప్రిన్సిపాల్ ఎం.మహేష్, శశిలక్ష్మి పర్యవేక్షించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో అజిత

ఒంగోలు రూరల్: ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత సిబ్బందికి సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శని, ఆదివారాల్లో చేపట్టిన ఓటర్ల చేర్పులు, మార్పులను శనివారం ఎంపీడీవో నిశితంగా పరిశీలించారు. ముక్తినూతలపాడు, త్రోవగుంట, కరవది, తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి బీఎల్‌వోల విధులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం బీఎల్‌వోలు అత్యంత జాగ్రత్తగా, పరిశీలనాత్మకంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎలాంటి పొరపాటు చేసినా బాధ్యులవుతారని, అలాంటి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని తెలిపారు. మార్పులు, చేర్పులు కోరిన వారు వ్యక్తిగతంగా హాజరై వారు కోరుతున్న అంశం గురించి సపోర్టింగ్ డాక్యుమెంటు జతచేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు నాగేంద్రకుమార్, వేమా శ్రీలక్ష్మి, డీఎల్‌వోలు నాగశివలీల, వెంకటాద్రి, కరవది వీఆర్వో జగదీష్ బాబు పాల్గొన్నారు.

అధ్యాపకునికి డాక్టరేట్


సాయిసందీప్‌ను అభినందిస్తున్న క్విస్ చైర్మన్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు: స్థానిక క్విస్ కాలేజీ ఎంబీఏ విభాగంలో సహ ఆచార్యులుగా పేనిచేస్తున్న సాయిసందీప్‌కు అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఏ స్టడీ ఆన్ ఎంటర్‌ప్రెన్యూరియల్ బిహేవియర్ ఎమాంగ్ ది రూరల్ యూత్ ఇన్ ప్రకాశం డిస్ట్రిక్ట్ అనే అంశంపై ఆయన నిర్వహించిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. తన పరిశోధన ఫలితాలు ప్రకాశం జిల్లా అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాయిసందీప్‌ను క్విస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి గాయత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు, ఎంబీఏ విభాగం అధిపతి డాక్టర్ షంషద్ అహ్మద్ అభినందించారు.

నిరీక్షణ తల్లిదండ్రులకు పరామర్శ


నిరీక్షణ తల్లిదండ్రులను పరామర్శిస్తున్న సుబ్బారావు

ఒంగోలు టౌన్: గత శనివారం నగరంలో కిడ్నాప్‌నకు గురైన 9 నెలల పాప నిరీక్షణ తల్లిదండ్రులను రాష్ట్ర గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు గంటా సుబ్బారావు శనివారం పరామర్శించారు. కిడ్నాప్ జరిగి వారం రోజులు గడుస్తున్నా కేసు పురోగతి లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సాధ్యమైనంత త్వరగా కేసును ఛేదించి పాపను తల్లిదండ్రులకు అప్పగించాలని కోరారు. నగరంలో, హైవేల మీద బర్త్‌డే పార్టీల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం ఎక్కువైందని, పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని విజ్ఞప్తి చేశారు. లక్షల మంది నివశించే నగరంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం వలన ఇలాంటి కేసుల్లో వస్తున్న ఇబ్బందులను ఇప్పటికైనా గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సుబ్బారావు కోరారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ


విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న శిద్దా సుధాకర్

చీమకుర్తి: ఆర్యవైశ్య సంఘ నాయకుడు శిద్దా సుధాకర్ చేతుల మీదుగా చీమకుర్తి శిద్దానగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. సుధాకర్ వివాహ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సుధాకర్ కుటుంబ సభ్యులు, హెచ్ఎం యర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న రామచంద్రారెడ్డి, శాంతారావు, సుబ్బారెడ్డి, సూర్యనారాయణ

అల్లూరు (కొత్తపట్నం): అల్లూరులోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ముస్లిం శ్మశానానికి గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి, సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఉపసర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, శెట్టి రామకృష్ణారెడ్డి, గ్రామస్తులు టెంకాయలు కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ముస్లిం శ్మశానానికి ఇరువైపులా మట్టిని రోడ్డు చేయడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రావెల్ రోడ్డు వేస్తామన్నారు. 300 మీటర్లతో రోడ్డు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. రైతులు, గ్రామస్తులంతా సహకరించాలని కోరారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి


ప్రసంగిస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు

ఒంగోలు టౌన్: మహిళలు చట్టాలపై తగిన అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే శ్యాంబాబు సూచించారు. శనివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన పాల్గొని ప్రసంగిస్తూ పని ప్రదేశాలలో లైంగిక దాడులు, గృహ హింసకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. మహిళలు తమ మీద జరుగుతున్న దాడులు, హింస నుంచి రక్షణ పొందేందుకు న్యాయ స్థానాల సహాయం తీసుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార కమిటీల ద్వారా ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.మాధురి, సీడీపీఓ రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.